




ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

స్పార్క్ ఎడిషన్
EVENING 6 PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 239 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 2 + https:www.prajarepublic.com + వెల - 1/-
శుక్రవారం 04 ఏప్రిల్ 2025

RNI No: APTEL/2023/87888
Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole

# వక్ఫ్ బిల్లుకు ఆమోదం.. చరిత్రాత్మక మలుపు: ప్రధాని మోదీ పోస్ట్

వక్ఫ్ బిల్లును పార్లమెంట్ ఆమోదించడంపై ప్రధాని మోదీ హర్షం వ్యక్తంచేశారు. తాజా బిల్లుతో ఇన్నాళ్లూ అట్టడుగున ఉండిపోయిన వర్గాలకు మేలు చేకూరుతుందని పోస్ట్ పెట్టారు.

**దిల్లీ, ఏప్రిల్ 4, (రిపబ్లిక్ న్యూస్):** వివాదాస్పద వక్ఫ్ (సవరణ) బిల్లు-2025 ఎట్టకేలకు పార్లమెంటు ఆమోదం పొందింది. దేశవ్యాప్తంగా విస్తృత చర్చతో పాటు అధికార, విపక్షాల మధ్య తీవ్ర వాగ్వాదాల నడుమ ఉభయ సభలు ఈ బిల్లును ఆమోదించాయి. దీనిపై తాజాగా ప్రధాని మోదీ స్పందించారు. ఇదో చరిత్రాత్మక మలుపు అని హర్షం వ్యక్తంచేశారు. కొన్ని దశాబ్దాలుగా వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం లోపించిందని పేర్కొన్న ఆయన.. తాజా బిల్లుతో ఇన్నాళ్లూ అట్టడుగున ఉండిపోయిన వర్గాలకు మేలు చేకూరుతుందని వ్యాఖ్యానించారు. వారి గళం వినిపించే అవకాశం దక్కుతుందని పేర్కొన్నారు.



ప్రస్తుతం బిమ్ స్టెక్ సదస్సు నిమిత్తం థాయ్లాండ్ పర్యటనలో ఉన్న ప్రధాని మోదీ దీనిపై 'ఎక్స్' వేదికగా స్పందించారు. "వక్ఫ్ సవరణ బిల్లు, ముసల్మాన్ వక్ఫ్ (ఉపసంహరణ) బిల్లుకు పార్లమెంట్ ఆమోదం తెలపడం ఓ చరిత్రాత్మక మలుపు. సామాజిక-ఆర్థిక న్యాయం, పారదర్శకత, సమ్మిళిత వృద్ధి కోసం మన సమష్టి అన్వేషణలో ఓ కీలక ఘట్టం. ఇలాంటి చట్టాల బలోపేతం కోసం సహకరించిన కమిటీ సభ్యులు, చర్చల్లో పాల్గొన్న పార్లమెంట్ సభ్యులకు కృతజ్ఞతలు. ఇందులో సవరణల కోసం పార్లమెంటరీ కమిటీకి తమ విలువైన సూచనలు పంపిన పౌరులకు ప్రత్యేక ధన్యవాదాలు" అని ప్రధాని తన పోస్ట్లో పేర్కొన్నారు. "గత కొన్ని దశాబ్దాలుగా వక్ఫ్ వ్యవస్థలో జవాబుదారీతనం, పారదర్శకత లోపించాయి. ముఖ్యంగా ముస్లిం మహిళలు, పేద ముస్లింల ప్రయోజనాలను దెబ్బతీసింది. ఇప్పుడు పార్లమెంట్లో ఆమోదం లభించడంతో వారి హక్కులకు భద్రత లభించినట్లయ్యింది. ఈ బిల్లుతో ఇప్పుడు సామాజిక న్యాయం జరిగే ఓ ఆధునిక యుగంలోకి మనం ప్రవేశిస్తున్నాం. ప్రతి పౌరుడి గౌరవానికి ప్రాధాన్యం ఇవ్వడానికి మేం కట్టుబడి ఉన్నాం. ఇదే మార్గంలో పయనిస్తూ బలమైన, సమ్మిళిత భారత్ను కలిసి నిర్మిద్దాం" అని ప్రధాని పిలుపునిచ్చారు. సుదీర్ఘ చర్చ తర్వాత బుధవారం లోక్సభలో ఆమోదం పొందిన వక్ఫ్ బిల్లు, 'ముసల్మాన్ వక్ఫ్ (ఉపసంహరణ) బిల్లు'కు.. గురువారం రాజ్యసభ కూడా ఆమోదముద్ర వేసింది. ఇక, రాష్ట్రపతి సంతకం కోసం ఈ బిల్లులను ప్రభుత్వం పంపించనుంది. అక్కడ ఆమోదం పొందిన తర్వాత చట్టంగా మారనుంది. వక్ఫ్ బిల్లు పేరును... యూనిఫైడ్ వక్ఫ్ మేనేజ్మెంట్ ఎంపవర్మెంట్, ఎఫిషియెన్సీ అండ్ డెవలప్మెంట్ బిల్లుగా (ఉమీద్-యుఎంఈఈడీ)గా ప్రభుత్వం పేర్కొంది.

## సచివాలయంలో అగ్నిప్రమాదం...
## పరిశీలించిన సీఎం చంద్రబాబు

ఏపీ సచివాలయంలో అగ్నిప్రమాదం జరిగిన ప్రదేశాన్ని సీఎం చంద్రబాబు పరిశీలించారు.



**అమరావతి, ఏప్రిల్ 4, (రిపబ్లిక్ న్యూస్):** ఏపీ సచివాలయంలో అగ్నిప్రమాదం జరిగిన ప్రదేశాన్ని సీఎం చంద్రబాబు పరిశీలించారు. రెండో బ్లాక్ లో యూపీఎస్ బ్యాటరీ రూమ్ వద్ద శుక్రవారం ఉదయం ఈ ఘటన జరిగిన సంగతి తెలిసిందే. ప్రమాదం జరిగిన తీరుపై అధికారులను సీఎం వివరాలు అడిగి తెలుసుకున్నారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని ఆదేశించారు. దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు అధికారులు సీఎం చంద్రబాబుకు తెలిపారు.

## ఫార్మసీ విద్యార్థిని ఆత్మహత్యపై
## స్పందించిన పవన్ కల్యాణ్

రాజమహేంద్రవరంలో ఫార్మసీ విద్యార్థిని నాగాంజలి ఆత్మహత్య దురదృష్టకరమని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు.

**అమరావతి, ఏప్రిల్ 4, (రిపబ్లిక్ న్యూస్):** రాజమహేంద్రవరంలో ఫార్మసీ విద్యార్థిని నాగాంజలి ఆత్మహత్య దురదృష్టకరమని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. విద్యార్థిని కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. ఆమె ఆత్మహత్యకు కారకుడిపై చట్టప్రకారం చర్యలుంటాయని తెలిపారు. నాగాంజలి సూసైడ్ నోట్ మేరకు ఇప్పటికే ఆస్పత్రి ఏజీఎం దీపక్ ను పోలీసులు అరెస్టు చేసినట్లు పవన్ తెలిపారు. విద్యార్థినులు, యువతుల రక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు.



## యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ భూ నిర్వాసితులకు
## టీఎస్ జెన్కోలో ఉద్యోగాలు

ప్రత్యేక రాష్ట్రం వస్తే ఉద్యోగాలు వస్తాయని యువత పోరాటం చేసిందని, వారి ఆశలను నెరవేరుస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది లోనే 53 వేల మందికి నియామకపత్రాలు ఇచ్చిందని తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు.



**హైదరాబాద్, ఏప్రిల్ 4, (రిపబ్లిక్ న్యూస్):** ప్రత్యేక రాష్ట్రం వస్తే ఉద్యోగాలు వస్తాయని యువత పోరాటం చేసిందని, వారి ఆశలను నెరవేరుస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 53 వేల మందికి నియామకపత్రాలు ఇచ్చిందని తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ పరిధిలోని 112 మంది భూ నిర్వాసితులకు టీఎస్ జెన్కో ప్రభుత్వం ఉద్యోగాలు కల్పించింది. సంబంధిత నియామక పత్రాలను మాదాపూర్ సైబర్ గార్డెన్స్లో నిర్వహించిన సమావేశంలో భట్టి విక్రమార్క అందజేశారు. దామచర్ల మండలం వీర్లపాలెంకు చెందిన 112 మందికి జూనియర్ అసిస్టెంట్లు, ప్లాంట్ అటెండర్లు, ఆఫీస్ సబార్డినేట్ల ఉద్యోగాలు కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాజెక్టుల్లో భూములు కోల్పోయిన వారికి ఉద్యోగాలిస్తామని గత ప్రభుత్వ నేతలు చెప్పారని, భూ నిర్వాసితులు వృద్ధులైపోయారు కానీ, ఉద్యోగాలివ్వలేదని వ్యాఖ్యానించారు. ఇప్పుడు అలా జరగకుండా భూమి కోల్పోయిన వారికి వెంటనే ఉపాధి కల్పిస్తున్నామన్నారు. "ప్రభుత్వ ఉద్యోగాలు పొందలేని వారికి ఉపాధి కల్పించే కార్యక్రమం చేపట్టాం. రాజీవ్ యువ వికాసం ద్వారా యువతకు ఉపాధి కల్పించనున్నాం. ఈ పథకానికి రూ.9 వేల కోట్లు కేటాయించాం. ప్రపంచ ప్రసిద్ధి చెందిన కంపెనీలు హైదరాబాద్లో పెట్టుబడులు పెట్టేలా ఒప్పందాలు చేసుకున్నాం. రాజీవ్ గాంధీ సూచన మేరకు హైటెక్ సిటీకి నేదురమల్లి జనార్దన్రెడ్డి శంకుస్థాపన చేశారు. రాజీవ్ గాంధీ కృషితో నేడు ఐటీ రంగం ఎంతో మందికి ఉపాధి కల్పిస్తోంది. ఫ్యూచర్ సిటీలో మరిన్ని కంపెనీలు ఏర్పాటయ్యేలా కృషి చేస్తాం. హైదరాబాద్ను విస్తరిస్తే.. మరిన్ని పెట్టుబడులు వస్తాయి. ఉపాధి కూడా పెరుగుతుంది" అని భట్టి విక్రమార్క తెలిపారు.

## స్టాలిన్ సర్కారుకు షాక్..
## నీట్ వ్యతిరేక బిల్లును తిరస్కరించిన రాష్ట్రపతి

నీట్ నుంచి తమ రాష్ట్రాన్ని మినహాయించాలని తమిళనాడు ప్రభుత్వం చేసిన విజ్ఞప్తిని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము తిరస్కరించారు.




**చెన్నై, ఏప్రిల్ 4, (రిపబ్లిక్ న్యూస్):** వైద్య విద్యలో ప్రవేశాల కోసం నిర్వహించే నీట్ పరీక్ష నుంచి తమిళనాడు నుంచి మినహాయించాలని గత కొన్నేళ్లుగా రాష్ట్రం డిమాండ్ చేస్తోన్న సంగతి తెలిసిందే. దీనిపై కేంద్రం, డీఎంకే ప్రభుత్వం మధ్య వివాదం కొనసాగుతోంది. ఈ పరిణామాల వేళ స్టాలిన్ సర్కారుకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. తమిళనాడు పంపిన నీట్ వ్యతిరేక బిల్లును రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము తిరస్కరించారు. ఈ విషయాన్ని సీఎం స్టాలిన్ రాష్ట్ర శాసనసభలో వెల్లడించారు. "ఈ అంశంపై తమిళనాడు సర్కారు అన్ని వివరణలు ఇచ్చినప్పటికీ.. నీట్ నుంచి మన రాష్ట్రాన్ని మినహాయించేందుకు కేంద్రం తిరస్కరిస్తోంది.

ఇది దక్షిణాది రాష్ట్రాన్ని అవమానించడమే. అయితే, వారు (కేంద్రం) మన అభ్యర్థనను తిరస్కరించొచ్చు కానీ.. మన పోరాటాన్ని ఆపలేరు. ఈ నిర్ణయాన్ని సవాల్ చేసేందుకు న్యాయపరమైన మార్గాలను అన్వేషిస్తాం. న్యాయ నిపుణులను సంప్రదిస్తాం" అని స్టాలిన్ అసెంబ్లీలో తెలిపారు. దీనిపై సమగ్రంగా చర్చించేందుకు ఏప్రిల్ 9న అఖిలపక్ష సమావేశానికి పిలుపునిచ్చారు. నీట్ పరీక్ష కారణంగా తమిళనాడులో విద్యార్థుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయని రాష్ట్ర ప్రభుత్వం ఆందోళన వ్యక్తంచేస్తోంది. ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశాల కోసం జాతీయస్థాయిలో నిర్వహించే అర్హత పరీక్ష నీట్ పరిధి నుంచి తమిళనాడును శాశ్వతంగా మినహాయించాలంటూ అక్కడి ప్రభుత్వం ఓ బిల్లును తీసుకొచ్చింది. దీని ప్రకారం.. 12వ తరగతి మార్కుల ఆధారంగా విద్యార్థులకు వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాలు కల్పించాలని నిర్ణయించారు. ఈ బిల్లును ఇప్పటికే 2021, 2022లో రెండుసార్లు తమిళనాడు అసెంబ్లీ ఆమోదించింది. అనంతరం గవర్నర్కు పంపగా.. పలుమార్లు తిరస్కరణకు గురైంది. దీంతో బిల్లులో కొన్ని మార్పులు చేసి రాష్ట్రపతి ఆమోదం కోసం పంపించారు. ఇప్పటికే హిందీ వివాదం, డీలిమిటేషన్ వంటి అంశాలపై కేంద్రం, తమిళనాడు సర్కారు మధ్య వివాదం కొనసాగుతోంది. తాజాగా నీట్ బిల్లును తిరస్కరించడంతో ఇది మరింత ముదిరేలా కన్పిస్తోంది. వచ్చే ఏడాది తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ పరిణామాలు ప్రాధాన్యం సంతరించుకుంటున్నాయి.

## ఆస్తులు కాజేసిన మేనమామగా జగన్ చరిత్రలో మిగిలిపోతారు:షర్మిల

సరస్వతి పవర్ షేర్ల ఎంవోయూపై వైకాపా అధ్యక్షుడు జగన్ స్వయంగా సంతకం చేశారని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు.

**అమరావతి, ఏప్రిల్ 4, (రిపబ్లిక్ న్యూస్):** సరస్వతి పవర్ షేర్ల ఎంవోయూపై వైకాపా అధ్యక్షుడు జగన్ స్వయంగా సంతకం చేశారని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. ఇప్పటి వరకు ఒక్క ఆస్తి కూడా జగన్ తనకు ఇవ్వలేదని చెప్పారు. "విజయమ్మకు సరస్వతి పవర్ షేర్లను జగన్ గిఫ్ట్ కింద ఇచ్చారు. ఇచ్చిన షేర్లు మళ్లీ తనకే కావాలని ఆయన కోర్టుకు వెళ్లారు. స్వయంగా తల్లినే జగన్ మోసం చేస్తున్నారు. తల్లిపై కేసు వేసిన కుమారుడిగా.. మేనల్లుడు, మేనకోడలి ఆస్తులు కాజేసిన మేనమామగా ఆయన చరిత్రలో మిగిలిపోతారు. జగన్కు విశ్వసనీయత ఉందో.. లేదో.. వైకాపా వారే ఆలోచించాలి" అని షర్మిల వ్యాఖ్యానించారు.



## మంగళగిరి ప్రజలను గుండెల్లో పెట్టుకుని పనిచేస్తా:మంత్రి నారా లోకేశ్

మంగళగిరి ప్రజలను గుండెల్లో పెట్టుకుని పనిచేస్తానని మంత్రి నారా లోకేశ్ అన్నారు.



**మంగళగిరి, ఏప్రిల్ 4, (రిపబ్లిక్ న్యూస్):** మంగళగిరి ప్రజలను గుండెల్లో పెట్టుకుని పనిచేస్తానని మంత్రి నారా లోకేశ్ అన్నారు. నియోజకవర్గ ప్రజల కోసం దాదాపు 26 సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. 'మన ఇల్లు-మన లోకేశ్ కార్యక్రమంలో భాగంగా మంగళగిరిలో పేదలకు ఇళ్ల పట్టాలు అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. "మంగళగిరిలో అత్యధిక మెజార్టీతో నన్ను గెలిపించారు. మీకోసం అహర్నిశలు కృషి చేస్తున్నా. సూపర్ సిక్స్ హామీలతో పాటు మంగళగిరికి నేను ప్రత్యేకంగా ఇచ్చిన ఒక్కో హామీని నెరవేర్చే పనిలో ఉన్నాను. ఏప్రిల్ 13న వంద పడకల ఆసుపత్రికి శంకుస్థాపన చేస్తాం. సరిగ్గా ఏడాదికి ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహిస్తాం. 'ఎన్టీఆర్ సంజీవని' పేరుతో మంగళగిరి, తాడేపల్లిలో క్లినిక్లు ఏర్పాటు చేశాం. దుగ్గిరాలలోనూ మొబైల్ క్లినిక్ పెట్టి ఉచిత చికిత్సలతో పాటు మందులు అందిస్తున్నాం. నీటి సమస్య ఉంటే ట్యాంకర్ల ద్వారా నీరందిస్తున్నాం. నిరుపేదలకు తోపుడు బండ్లు, మహిళలకు కుట్టుమిషన్లు అందజేశాం" అని మంత్రి లోకేశ్ వివరించారు.

## శ్రీరామనవమి.. సీతమ్మకు 'సిరిసిల్ల' బంగారు చీర

శ్రీరామ నవమి సందర్భంగా సిరిసిల్లకు చెందిన నేత కార్మికుడు వెల్ది హరిప్రసాద్ ప్రత్యేకంగా పట్టు వస్త్రాలను సిద్ధం చేశారు.

**సిరిసిల్ల, ఏప్రిల్ 4, (రిపబ్లిక్ న్యూస్):** శ్రీరామ నవమి సందర్భంగా సిరిసిల్లకు చెందిన నేత కార్మికుడు వెల్ది హరిప్రసాద్ ప్రత్యేకంగా పట్టు వస్త్రాలను సిద్ధం చేశారు. పది రోజుల పాటు శ్రమించి నేసిన ఈ పట్టు చీర కొంగుపై భద్రాద్రి ఆలయ మూల విరాట్ను నేశారు. శంఖు, చక్ర నామాలు, హనుమంతుడు, గరుత్మంతుడును చీర బోర్డర్పై చూడొచ్చు. 'శ్రీరామ రామ రామేతి.. శ్లోకం చీరపై 51 సార్లు కనిపిస్తుంది. వన్ గ్రామ్ గోల్డ్ జరీ పట్టుతో రూపొందించిన ఈ ఏడు గజాల చీర బరువు దాదాపు 800 గ్రాములు. "ఏటా సీతారాముల కల్యాణానికి పట్టు వస్త్రాలు నేసే అవకాశం సిరిసిల్ల నేతన్నలకు కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరుకుంటున్నాని" హరిప్రసాద్ ఈ సందర్భంగా తెలిపారు.



## పీహెచ్సీ, సీహెచ్సీల్లో వర్చువల్ వైద్యసేవలు అందించాలి:చంద్రబాబు

ప్రతి నియోజకవర్గంలో 100 పడకల ఆస్పత్రి ఏర్పాటుకు కార్యాచరణ సిద్ధం చేయాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు.

**అమరావతి, ఏప్రిల్ 4, (రిపబ్లిక్ న్యూస్):** ప్రతి నియోజకవర్గంలో 100 పడకల ఆస్పత్రి ఏర్పాటుకు కార్యాచరణ సిద్ధం చేయాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. వైద్యారోగ్యశాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. అవసరాన్ని బట్టి పీహెచ్సీ, సీహెచ్సీలో వర్చువల్ వైద్యసేవలు అందించాలన్నారు. రాష్ట్రంలో కొత్తగా 13 డీ-అడిక్షన్ సెంటర్లు ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. అమరావతి మెగా గ్లోబల్ మెడిసిటీ ప్రాజెక్టు ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు.



printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com


ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్పెషల్




## చరిత్రలో నేటి ప్రత్యేకత

- 1818 : అమెరికా సంయుక్త రాష్ట్రాలు 13 చారలు, 20 నక్షత్రాల జాతీయ జండాను నిర్ధారించింది.
- 1905 : కాంగ్రా భూకంపంలో 20,000 మంది ప్రజలు మరణించారు.
- 1919 : ఇంగ్లీష్ భౌతిక, రసాయన శాస్త్రవేత్త సర్ విలియం క్రూక్స్ మరణం (జ.1832). (చిత్రంలో)
- 1968 : అమెరికాకు చెందిన పాస్టర్, ఉద్యమకారుడు మార్టిన్ లూథర్ కింగ్ మరణం (జ. 1929).
- 1975 : మైక్రోసాఫ్ట్ సంస్థ స్థాపించబడింది.
- 1979 : భావకవి అబ్బూరి రామకృష్ణారావు మరణం (జ.1896).


అమెరికా జాతీయ జండా


కాంగ్రా భూకంపం


సర్ విలియం క్రూక్స్


మార్టిన్ లూథర్ కింగ్



మైక్రోసాఫ్ట్ సంస్థ


అబ్బూరి రామకృష్ణారావు

రిపబ్లిక్ స్పోర్ట్స్

### అత్యంత ఖరీదైన ఆటగాడు...

## దానర్థం అది కాదు: వెంకటేశ్ అయ్యర్

తొలి రెండు మ్యాచుల్లో విఫలమైన వెంకటేశ్ అయ్యర్.. కీలకమైన మ్యాచ్లో చెలరేగాడు. తన జట్టు విజయం సాధించడంలో కీలక పాత్ర పోషించాడు.




ఐపీఎల్ 2025 సీజన్లో అత్యంత ఖరీదైన ఆటగాళ్లలో మూడో క్రికెటర్ వెంకటేశ్ అయ్యర్. కోల్‌కతా నైటైడర్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తోన్న వెంకటేశ్ తాజాగా సన్రైజర్స్ హైదరాబాద్ పై హాఫ్ సెంచరీ సాధించాడు. కేవలం 29 బంతుల్లోనే 60 పరుగులు చేశాడు. అయితే, తొలి రెండు మ్యాచుల్లో 9 పరుగులు మాత్రమే చేశాడు. ఐపీఎల్ మెగా వేలం ముందు రిటెన్షన్లో భాగంగా వెంకటేశ్ అయ్యర్ను కేకేఆర్ రూ.23.75 కోట్లకు అట్టిపెట్టుకుంది. సన్రైజర్స్ మ్యాచ్ అనంతరం వెంకటేశ్ మాట్లాడుతూ.. అత్యధిక పెయిడ్ క్రికెటర్ను అయినంత మాత్రాన ప్రతి మ్యాచ్లోనూ పరుగులు చేయాలనేమీ లేదని వ్యాఖ్యానించాడు. "ఒక్కసారి ఐపీఎల్ మ్యాచులు ప్రారంభమైతే.. సదరు ప్లేయర్ అమ్ముడైంది రూ.20 లక్షలకా? రూ. 20 కోట్లకా? అనేది అవసరం లేదు. ఇక్కడ డబ్బు మన ఆటను నిర్దేశించదు. మా జట్టులో రఘువంశీ యువ క్రికెటర్.. అద్భుతంగా ఆడాడు. ఇక్కడే హై పేమెంట్, అంచనాలపై ప్రశ్నలు వస్తాయి. అయితే, నేను జట్టు విజయంలో ఎప్పుడూ భాగస్వామ్యం అయ్యేందుకు ప్రయత్నించే క్రికెటర్ను. కొన్ని బంతులే ఉన్నప్పుడు దూకుడుగా ఆడేందుకు ప్రయత్నిస్తా. అప్పుడు పరుగులు చేయలేకపోయినా.. వేగంగా ఆడే ప్రయత్నం మాత్రం ముఖ్యం. నా జట్టు కోసం ఏదైనా చేస్తా. ఇక్కడ నేను అత్యధిక మొత్తం అందుకొనే క్రికెటర్నైనా ప్రతి మ్యాచ్లోనూ పరుగులు చేయాలని దానర్థం కాదు. ఐపీఎల్ మ్యాచ్ అంటేనే ఒత్తిడి ఉంటుంది. జట్టు విజయం కోసం ఏం చేశామనేదే కీలకం. అందులో నేనెప్పుడూ వెనకడుగు వేయను" అని వెంకటేశ్ తెలిపాడు.

### బౌలింగ్ ఎవరని చూడను..

సన్ రైజర్స్‌తో మ్యాచ్లో చివరి 12 బంతుల్లో వెంకటేశ్ అయ్యర్ రెండు బంతులు, రెండు సిక్సు బాదాడు. ఇన్నింగ్స్ 19వ ఓవర్ను పాట్ కమిన్స్ వేయగా.. 20 పరుగులు రాబట్టాడు. దీనిపై అయ్యర్ స్పందిస్తూ.. "అక్కడ ఎవరు బౌలింగ్ చేస్తారనేది పట్టించుకోను. ఎలా బౌలింగ్ చేస్తాడనే దానిపై దృష్టిపెడతా. ఫీల్డింగ్ ప్లేస్మెంట్ను చూసి హిట్టింగ్ చేయడానికి ప్రయత్నిస్తా" అని వ్యాఖ్యానించాడు.

## దర్శకుడికి రామ్ చరణ్ దంపతుల గిఫ్ట్.. ఎందుకంటే!

దర్శకుడు బుచ్చిబాబుకు రామ్ చరణ్ దంపతులు ప్రత్యేక బహుమతి పంపారు. ఈ విషయాన్ని ఆయన ఎక్స్ వేదికగా పంచుకున్నారు.




దర్శకుడు బుచ్చిబాబుకు రామ్చరణ్ దంపతులు ప్రత్యేక బహుమతి పంపారు. ఈవిషయాన్ని తెలుపుతూ ఆయన ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. ఈ బహుమతి తనకెంతో ప్రత్యేకమని పేర్కొన్నారు. ఇటీవల రామ్చరణ్ 40వ పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగిన సంగతి తెలిసిందే. ఆయన పుట్టినరోజు సందర్భంగా దర్శకుడు బుచ్చిబాబుకు చరణ్ దంపతులు హనుమాన్ చాలీసా పుస్తకాన్ని, హనుమంతుడి ప్రతిమను గిఫ్ట్ పంపారు. 'నా మనసులో నీకెప్పుడూ ప్రత్యేకమైన స్థానం ఉంటుంది. ఆ హనుమంతుడి ఆశీస్సులు నీపై ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటున్నాను' అని రాసి ఉన్న నోట్, శ్రీరాముని పాదుకలను కూడా పంపారు. ఆ ఫొటోలను పంచుకున్న బుచ్చిబాబు ఈ బహుమతి మీ ప్రేమను తెలియజేస్తుందంటూ రామ్ చరణ్, ఉపాసనను ట్యాగ్ చేస్తూ పోస్టెట్టారు. ప్రస్తుతం బుచ్చిబాబు దర్శకత్వంలో రామ్చరణ్ హీరోగా 'పెద్ది' సినిమా తెరకెక్కుతోంది. జాన్వీకపూర్ కథానాయిక. ఇటీవలే ఈ సినిమా హీరో ఫస్ట్ లుక్ను విడుదల చేయగా అది ఆదరణను సొంతం చేసుకుంది. క్రీడా నేపథ్యంలో, మూలాల్ని ఆవిష్కరించే ఓ గ్రామీణ కథగా ఈ చిత్రం రూపొందుతున్నట్టు సమాచారం. గుర్తింపు కోసమే పెద్ది పోరాటం చేస్తాడని రామ్చరణ్ సామాజిక మాధ్యమాల ద్వారా పేర్కొన్నారు. కన్నడ స్టార్ శివరాజ్కుమార్, జగపతిబాబు, దివ్యేందు శర్మ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి ఎ.ఆర్.రెహమాన్ సంగీతం అందిస్తున్నారు.

### బయటవారే ఆ ఇండస్ట్రీని తిరిగి నిలబెడతారు..

## :బాలీవుడ్పై విజయ్ దేవరకొండ కీలక వ్యాఖ్యలు

బాలీవుడ్లో తాజా పరిస్థితులను ఉద్దేశించి హీరో విజయ్ దేవరకొండ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ పరిశ్రమ త్వరలో తిరిగి పూర్వ వైభవం సొంతం చేసుకుంటుందని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు.



హిందీ చిత్ర పరిశ్రమ ఎదుర్కొంటోన్న తాజా ఇబ్బందులను ఉద్దేశించి నటుడు విజయ్ దేవరకొండ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ పరిశ్రమ త్వరలోనే తిరిగి పూర్వ వైభవాన్ని సొంతం చేసుకుంటుందని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఇప్పుడు దక్షిణాది సినిమాలకు విశేష ఆదరణ లభిస్తోందని ఆయన గుర్తు చేశారు. తెలుగు సినిమా ఈ స్థాయికి చేరడం వెనక ఎంతోమంది శ్రమ, కృషి ఉందన్నారు. 'బాహుబలి' సినిమాని ఉదహరిస్తూ విజయ్ దేవరకొండ తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. "దక్షిణాది చిత్రపరిశ్రమ ఇప్పుడు ఉన్నతస్థాయిలో రాణిస్తోంది. ఇప్పుడైతే ఈ చిత్ర పరిశ్రమకు దేశవిదేశాల్లో గుర్తింపు ఉంది. ప్రేక్షకులు మా సినిమాలు చూసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. కానీ, ఒకానొక సమయంలో ఇక్కడి సినిమాలకు సరైన గుర్తింపు ఉండేది కాదు. కాబట్టి, ఇదొక సర్కిల్ లాంటిది. రానున్న ఐదు లేదా పదేళ్లలో పరిస్థితులు మరోవిధంగా మారొచ్చు. బాలీవుడ్లో ఇప్పుడు ఒక లోటు ఏర్పడింది. ఆ లోటును తీర్చేందుకు త్వరలోనే కొత్త దర్శకులు పుట్టుకొస్తారు. హిందీ చిత్రపరిశ్రమ గొప్ప దర్శకులను ప్రేక్షకులకు అందించనుందని నమ్ముతున్నా. కాకపోతే వారు.. ముంబయికి సంబంధం లేకుండా బయటవారే అయి ఉంటారని అనిపిస్తుంది" అని విజయ్ దేవరకొండ అన్నారు. అనంతరం ఆయన 'బాహుబలి'ని ఉదాహరణగా చెబుతూ.. "తెలుగు సినిమా ప్రేక్షకుల ఆదరణ సొంతం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో రాజమౌళి 'బాహుబలి'ని రూపొందించారు. భారీ మొత్తంలో ఖర్చు పెట్టారు. ఇక్కడ ఇలాంటి గొప్ప సినిమా రూపొందుతుందని బాలీవుడ్ వాళ్లకు అప్పుడు తెలిసి ఉండకపోవచ్చు. అదే కనుక వర్కౌట్ కాకపోతే ఎంతోమంది కెరియర్స్ ముగిసిపోయేవి. నిర్మాతలు చిక్కుల్లో పడేవారు. నటీనటులు ఒక్కొక్కరు సుమారు 5 ఏళ్లు ఈ సినిమా కోసం వర్క్ చేశారు. కాబట్టి, పోటీ అనేది అన్నిచోట్లా ఉంది. ప్రతిఒక్కరూ తమ స్థానం కోసం పోరాటం చేయాలి. హిందీ చిత్ర పరిశ్రమ కూడా తమ దారులను కనుగొని, ఉన్నతంగా ముందుకుసాగుతుందని నమ్ముతున్నా" అని వివరించారు. విజయ్ దేవరకొండ ప్రస్తుతం 'కింగ్ డమ్' కోసం వర్క్ చేస్తున్నారు. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహిస్తున్నారు.

రిపబ్లిక్ సినిమా CINEMA

### స్విమ్మింగ్ రాకపోయినా..

## '1' మూవీ కోసం మహేష్ బాబు సాహసం

'1' నేనొక్కడినే' సినిమా కోసం మహేష్ బాబు రియల్ స్టంట్ చేశారట. ఇదే విషయాన్ని గతంలో ఒకసారి సుకుమార్ కూడా పంచుకున్నారు.



అటు యువతతో పాటు, ఇటు మాస్లోనూ మంచి ఫాలోయింగ్ ఉన్న స్టార్ హీరో మహేష్ బాబు. సుకుమార్ దర్శకత్వంలో ఆయన కథానాయకుడిగా నటించిన సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్ '1: నేనొక్కడినే'. బాక్సాఫీస్ వద్ద ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయిన ఈ సినిమా టెక్నికల్గా హై స్టాండర్డ్లో తెరకెక్కించారు. సుకుమార్ టేకింగ్ విమర్శకులను సైతం మెప్పించింది. అయితే, ఈ సినిమా కోసం మహేశ్‌బాబు రియల్ స్టంట్ చేశారు. ఇదే విషయాన్ని గతంలో ఒకసారి సుకుమార్ కూడా పంచుకున్నారు. మహేశ్ బాబు విలన్ గ్యాంగ్ నుంచి తప్పించుకునేందుకు బోటు తీసుకుని సముద్రంలోకి వెళ్తారు. అందులో నటించిన ఆర్టిస్టందరూ ప్రొఫెషనల్ స్విమ్మర్స్ కాగా, మహేశ్‌బాబుకు ఈత సరిగా రాదట. మిగిలిన వాళ్లందరూ లైఫ్ జాకెట్లు వేసుకొని నటిస్తే, మహేశ్ అవేవీ లేకుండా రిస్క్ చేసి మరీ ఆ సీన్లో నటించారు. అంతేకాదు, ఒక ప్రొఫెషనల్ డ్రైవర్ బోటును ఎలా నడుపుతారో అంతే వేగంతో నడిపారట. ఆ సీన్ తీస్తున్నప్పుడు చిత్ర బృందం చాలా కష్టపడిందని సుకుమార్ అప్పట్లో చెప్పారు. అంతేకాదు, హిట్ అవ్వాల్సిన సినిమా ఫ్లాప్ అయిందన్న బాధ ఎప్పుడూ తనని వెంటాడుతూ ఉంటుందని సుకుమార్ అంటుంటారు. "హిట్ అయ్యే సినిమాను ఫ్లాప్ చేశానే అనిపిస్తుంది. ఒక సీన్ తో వెర్షన్ మార్చేయొచ్చు. హీరో ఒక మానసిక సమస్యతో బాధపడుతూ ఉంటాడు. అది నిజం కాదని, అతను డ్రామా ప్లే చేస్తున్నాడని ఒక వెర్షన్ అనుకున్నా. కానీ, నేను ఎమోషనల్ సైడ్ వెళ్లిపోయా. మొదటి వెర్షన్ చెప్పినప్పుడు ప్రొడ్యూసర్ రామ్ ఆచంటకి బాగా నచ్చింది. ఆయన మెచ్చుకున్నారు కూడా. కానీ, సినిమా తీసే సమయానికి అది కాస్తా మారిపోయి, ఇప్పుడు మీరు చూస్తున్న వెర్షన్ వచ్చింది. ఇంకో రెండు సీన్లు తీసి, ఎడిటింగ్ టేబుల్పై చూసుకోవాల్సింది. నిడివి పెరిగిపోవడంతో చాలా సీన్లు తీసేశా. అందుకే ప్రేక్షకులకు అర్థం కాలేదేమో" అని అన్నారు. ప్రస్తుతం రాజమౌళి దర్శకత్వంలో మహేశ్ బాబు ఓ యాక్షన్ అడ్వెంచర్ ఫిల్మ్ లో నటిస్తున్నారు. ఇటీవల ఒడిశా షెడ్యూల్ పూర్తయింది. ఇక సుకుమార్ 'పుష్ప2' సక్సెస్ తర్వాత తన తదుపరి సినిమాల కోసం స్క్రిప్టు సిద్ధం చేసుకుంటున్నారు.


## ఆరోగ్యం

## బాడీ మొత్తాన్ని డీటాక్స్ చేసి బ్లడ్ షుగర్‌ని తగ్గించే బెస్ట్ డ్రింక్, ఎలా తయారుచేసి తాగాలంటే


నిమ్మరసం, జీలకర్ర రెండూ విడివిడిగా మంచివే. వీటి రెండింటి కలయిక. అందులో కొద్దిగా ఉప్పు వేసి తాగితే మరిన్ని లాభాలు ఉంటాయి. అవేంటో తెలుసుకోండి.

ఉదయాన్నే చాలా మంది నిమ్మరసం తాగుతుంటారు. అందులో తేనె వేసుకుని తాగుతారు. అయితే, దీని బదులు ఓ సారి కొత్తగా రొటీన్‌కి భిన్నంగా కాస్తా ఉప్పు జీలకర్ర వేసి తాగండి. ఇది నోటికి రుచిగా ఉండడమే కాదు ఎన్నో లాభాలని అందిస్తుంది. దీనివల్ల కలిగే లాభాలు తెలిస్తే రోజూ ఇలానే తాగుతుంటారు. మరెంటో చకచకా తెలుసుకోండి.






### హైడ్రేషన్



ఈ డ్రింక్‌లో సాల్ట్ కలుస్తుంది. ఇందులో ఎలక్ట్రోలైట్స్ ఉంటాయి. ఇక నిమ్మలో కూలింగ్ ఏజెంట్స్ ఉంటాయి. ఇవి బెస్ట్ హైడ్రేషన్‌ని అందిస్తాయి. ఈ డ్రింక్‌ని తీసుకోవడం వల్ల మినరల్స్ అందుతాయి. దీంతో వీక్‌నెస్ తగ్గుతుంది. బాడీ హైడ్రేటెడ్‌గా ఉంటుంది.

### బ్లడ్ షుగర్ తగ్గేందుకు





జీలకర్ర, నిమ్మరసం, ఉప్పు ఈ మూడు కలిపిన డ్రింక్ తీసుకోవడం వల్ల బ్లడ్ షుగర్ లెవల్స్ తగ్గుతాయి. దీని వల్ల ఇన్సులిన్ సెన్సిటివిటీ పెరుగుతుంది. దీంతో ఒక్కసారిగా షుగర్ లెవల్స్ పెరగడకుండా కంట్రోల్‌గా ఉంటాయి. ఇది షుగర్ ఉన్నవారికి సరైన డ్రింక్. రెగ్యులర్‌గా తీసుకుంటే షుగర్ లెవల్స్ తగ్గుతాయి.

### జీర్ణశక్తి పెరగడం




జీలకర్ర, ఉప్పు కలిపిన నిమ్మరసం తీసుకోవడం వల్ల జీర్ణ వ్యవస్థలు ఎంజైమ్స్ పెరుగుతాయి. దీనివల్ల బ్లోటింగ్, అసిడిటీ, మలబద్ధకం తగ్గుతుంది. గట్ హెల్త్ మెరుగ్గా మారుతుంది. జీర్ణ వ్యవస్థ మెరుగ్గా మారుతుంది. నిమ్మరసం, ఉప్పు రెండు కూడా కడుపులోని అసిడిటీని బ్యాలెన్స్ చేస్తాయి. జీలకర్ర జీర్ణవ్యవస్థని ప్రశాంతపరుస్తుంది. ఈ పవర్‌ఫుల్ కాంబినేషన్ యాసిడ్ రిఫ్లక్స్, గుండెల్లో మంట, జీర్ణ సమస్యల్ని తగ్గిస్తుంది.

### ఇమ్యూనిటీ




నిమ్మలో విటమిన్ సి ఎక్కువగా ఉంటుంది. జీలకర్రలో మినరల్స్ ఎక్కువగా ఉంటాయి. ఈ రెండింటి కాంబినేషన్ ఇమ్యూనిటీని పెంచుతాయి. ఇన్ఫెక్షన్స్‌ని తగ్గిస్తాయి. దీని వల్ల సీజన్‌లో వచ్చే సమస్యలు, జ్వరాలు, ఫ్లూని తగ్గిస్తాయి.

### డీటాక్స్




సాధారణంగా బాడీని డీటాక్స్ చేసేందుకు ఎన్నో రకాల డ్రింక్స్ ఉన్నాయి. అయినప్పటికీ, ఎక్కువగా నిమ్మరసాన్నే ప్రిఫర్ చేస్తారు. ఇక దీంతో జీలకర్ర, ఉప్పుని కలిపి తాగడం వల్ల బాడీ డీటాక్స్ అవుతుంది. దీంతో పాటు లివర్, కిడ్నీల్ కూడా ప్యూరీఫై అవుతాయి. ఇవి డీటాక్స్ అయిన ఎఫెక్ట్ ఆరోగ్యంపై మాత్రమే కాకుండా, స్కిన్, మొత్తం హెల్త్‌పైనే పడుతుంది.

### స్కిన్ హెల్త్



ఈ మూడింటి కలయికలో యాంటీ ఆక్సిడెంట్స్, యాంటీ ఆన్‌ఫ్లమేటరీ గుణాలు ఎక్కువగా ఉంటాయి. దీనిని రెగ్యులర్‌గా తీసుకోవడం వల్ల యాక్నే తగ్గుతుంది. వయసు పెరిగితే వచ్చే సమస్యలు వస్తాయి. బాడీలో నేచురల్‌గానే కొల్లాజెన్ పెరుగుతుంది. దీంతో షైనీగా ఉంటారు. స్కిన్ మెరుస్తుంది.

### బరువు తగ్గడం



ఈ మూడింటి కలయిక బాడీలో మెటబాలిజాన్ని పెంచుతుంది. ఆకలిని తగ్గుతుంది. బాడీలోని ఫ్యాట్ మొత్తాన్ని కరిగిస్తుంది. రెగ్యులర్‌గా తీసుకుంటే హెల్దీగానే బరువు తగ్గుతారు. బాడీ ప్యూరీఫై అవుతుంది. దీని వల్ల ఎక్కువ కేలరీలు తీసుకోకుండా ఉంటారు. ఈ కారణంగానే బరువు తగ్గుతారు.

### డీటాక్స్‌ఎలా తయారుచేయాలి



ఓ టీస్పూన్ జీలకర్రని రాత్రి గ్లాసు నీటిలో నానబెట్టాలి. ఉదయాన్నే ఆ నీటిని మరిగించాలి. తర్వాత స్టౌ ఆఫ్ చేసి కాస్తా చల్లారక ఓ టీస్పూన్ నిమ్మరసం, తగినంత ఉప్పు వేసి తాగండి. ఇది చాలా టేస్టీగా ఉంటుంది. తాగినకొద్దీ తాగాలనిపిస్తుంది. అయితే, అప్పటికప్పుడు చేసుకోవాలనుకునేవారు జీలకర్రని పొడిలా కూడా చేసి వాడుకోవచ్చు. గమనిక :ఇది సాధారణ సమాచారం కోసం మాత్రమే. ఇది ఏ విధంగానూ ఏ మెడిసిన్ లేదా చికిత్సకు ప్రత్యామ్నాయం కాదు. వీటిని పాటించేముందు మరింత సమాచారం కోసం ఎల్లప్పుడూ మీ వైద్యుడిని సంప్రదించండి. తెలుగు సమయం ఈ విషయాల్ని ధృవీకరించడం లేదు. ఖచ్చితత్వం, ప్రభావానికి తెలుగు సమయం బాధ్యత వహించదు.